క్లుప్తంగా

ఆలయాల్లో భక్తుల రద్దీ



ధర్మపురి ప్రధాన ఆలయంలో భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. నేడు పెద్ద హన్మాన్ జయంతి సందర్భంగా ఒక్క రోజు ముందు నుండే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ముందు వెలుపల, గోదావరి తీరంలో భక్తుల సౌకర్యార్థం చల్లటి మినరల్ వాటర్‌తో పాటు నీడ, నీటి వసతులు కల్పించారు.

ఒక్క రోజు ఆదాయం 3.07 లక్షలు

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం ఒక్క రోజు టికెట్లు, ప్రసాదాలు, అన్నదానం కింద 3,07,192 రూ.ల ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్

ధర్మపురి: ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భూసారం పెరుగడానికి ఈ విత్తనాలు ఎంతో ఉపయోగ పడుతాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు, సీఈవో రాజేశ్ తదితరులున్నారు.

సాయి ఆలయంలో కమిషనర్ పూజలు



పూజలు చేస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిరామా ఆలయ వార్షికోత్సవ వేడకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ రామకృష్ణా రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో కే.కాంతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ డిప్యూటీ సీఈవోకు సన్మానం



వరదరాజన్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

కోరుట్ల: నిజామాబాద్ జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈవో గా సేవలందించిన కోరుట్ల పట్టణానికి చెందిన దొంతుల సుందర వరద రాజన్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు కోరుట్ల పట్టణ ఆర్యవైశ్య నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ పట్టణ మాజీ అధ్యక్షుడు మంచాల జగన్, కంటాల బాస్కర్, శక్కరి అశోక్, ఉప్పులపు భూపతి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు వినతి

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లికి ఆర్‌టీసీ బస్ సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన నాయకులు శుక్రవారం కోరుట్ల డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు.గతంలో పాఠశాల విద్యార్థుల కోసం రోజు రెండు ట్రిప్పులు వచ్చేవని, పాఠశాల సెలవుల కారణంగా బస్సులు నడపటం లేదన్నారు. ప్రయాణికుల అవసరాల దృష్ట్యా యథావిధిగా రెండు ట్రిప్పులు వెంటనే ప్రారంభించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లె నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎండీ రహీం, జైరెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మేడిపల్లి: మండల కేంద్రానికి చెందిన గరిపెల్లి రాజగౌడ్ రోజులాగే తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలైనాయి. స్థానికులు జగిత్యాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిగా చికిత్స పొందుతున్నాడు.

ప్రతీ రైతుకు విత్తనాలు అందేలా చర్యలు



ఆగ్రోస్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ప్రతి రైతుకు విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైతు డిపో, ఆగ్రోస్ ఏజెన్సీలలో విత్తనాలు, ఫెస్టిసైడ్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలం సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. నిత్యం రెవెన్యూ, పోలీసు, వ్యవసాయాధికారులు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వానాకాలం పంటకు అనుగుణంగా 3 లక్షల ఎకరాలకు సరిపడా వరి విత్తనాలు 20 వేల ఎకరాలకు సరిపడా పత్తి విత్తనాలు, 41 వేల ఎకరాలకు సరిపడా మొక్కజొన్న, 2500 ఎకరాలకు సరిపడా కంది విత్తనాలు, పప్పు దినుసుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగు విత్తనాలు సైతం రైతులకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. యూరియా 1688, కాంప్లెక్స్ ఎరువులు 7177, డీఏపీ 1710 నిలువ ఉన్నాయన్నారు. రైతులు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తనాల కవరు తప్పనిసరిగా సీజన్ అయిపోయేంత వరకు భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వాణి, తహసీల్దార్ వరదన్, ఎస్సై మన్మథరావు పాల్గొన్నారు.

విత్తనాలు అందాయా...?

షాపులను తనిఖీ చేస్తున్న నేపథ్యంలో అక్కడకు వచ్చిన రైతులను విత్తనాలు అందుతున్నాయా అని కలెక్టర్ యాస్మిన్ బాషా అడిగి తెలుసుకున్నారు. చల్గల్‌కు చెందిన గంగారెడ్డి అనే రైతు విత్తనాల కోసం రాగా అతనిని ఎన్ని ఎకరాలు వేస్తున్నావు, విత్తనాలు వచ్చాయా అని అడుగగా గంగారెడ్డి 9 ఎకరాల్లో 4 ఎకరాల సన్న వడ్లు, 5 ఎకరాల్లో దొడ్డు వరిపోశానని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకున్నానని చెప్పారు. ఏదైనా అవసరం ఉన్న తమ వద్దకు రావాలని సూచించారు.

ఘనంగా దుర్గామాత బోనాలు



ఊట్‌పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లిలో దుర్గామాత బోనాల పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఊరేగింపులో విన్యాసాలు, డప్పుల చప్పుళ్లు అలరించాయి. దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో నాయకులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బోనాలు..

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్లలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున డప్పుచప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా బోనాలతో ఊర చెరువు సమీపంలోని గంగమ్మతల్లి ఆలయం వద్దకు వెళ్లి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో హనుమాన్ మాలాధారణ భక్తులు

వెల్గటూర్: మండలంలోని వెంకటాపూర్‌లో హనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం హనుమాన్ భక్తులు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. హనుమాన్ పాటలతో, డీజే చప్పుల్లతో, మాలాధారణ స్వాముల నృత్యాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



హరీశ్ గౌడ్(ఫైల్)

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన అనుపురం హరీశ్ గౌడ్(28) అనే గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం హరీశ్‌ను కరీంనగర్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య నితిక ఉంది. కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ పాలకుర్తి రవి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: దేశం కోసం సర్వస్వాన్ని అర్పించిన మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక సమరస సాధన వేదిక రాష్ట్ర ప్రతినిధి ఆకుతోట వెంకటరమణారెడ్డి కోరారు. గౌతమ బుద్ధుడు, వీరసావర్కర్, భాగ్యరెడ్డి వర్మ, రాణి అహల్యాబాయి హోల్కర్‌ల జయంతి ఉత్సవాలను శుక్రవారం జగిత్యాల పట్టణంలోని గీతా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ,స్వాతంత్ర్య సాధన కోసం కృషి చేసిన మహనీయుల అడుగుజాడల్లో నడిచి వారి ఆశయాలను కొనసాగించాలని కోరారు. కుల వివక్షతలేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు భూమారెడ్డి,సూర్యనారాయణ,మదనమోహన్, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న ఆశావర్కర్లు

జగిత్యాల: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆశాలకు నష్టం కలిగించేలా పరీక్షలు నిర్వహించాలన్న నిర్ణయాన్ని పభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అన్ని పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. సీనియార్టీ ఉన్న ఆశావర్కర్లకు మళ్లీ కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహిస్తామనడం సమంజసం కాదన్నారు. గతంలో సైతం ఈ విధానాన్ని పాటిద్దామని చూశారని, కానీ పెద్ద ఎత్తున సమ్మె చేస్తే ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, మళ్లీ తెస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఇందూరి సులోచన, ఆశావర్కర్లు ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారుల సేవలు స్ఫూర్తివంతం



సత్యనారాయణను సన్మానిస్తున్న ఏఎస్పీ

జగిత్యాలక్రైం: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారుల సేవలు స్ఫూర్తివంతమని అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ఆర్ఐ జానీమియా, ఆర్ఎస్సై కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఓ ఎరువులు, విత్తనాల దుకాణాన్ని తహసీల్దార్ కిషన్ వ్యవసాయ విస్తరణ అధికారి నరేశ్‌తో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో స్టాక్ రిజిస్టర్, రికార్డులు, గోడౌన్‌లు, లైసెన్స్ వివరాలు పరిశీలించారు. డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయించవద్దని, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

మల్లాపూర్: రైతులకు అనుమతి లేకుండా ఫెస్టీసైడ్స్‌ను ఫర్టిలైజర్ నిర్వాహకులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వీర్‌సింగ్, ఏవో లావణ్య హెచ్చరించారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను వారు తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించరాదని, ఎవరైనా ఫర్టిలైజర్ నిర్వాహకులు నకిలీ విత్తనాలు సరఫరా చేసిన గాని, అమ్మిన గాని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మయ్య, రెవెన్యూ, వ్యవసాయశాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

బుగ్గారం: నకిలి విత్తనాలు అమ్మితే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు విత్తన, పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలు, ఎరువులు, మందులను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయాధికారి రామచంద్రం, తహసీల్దార్, డెప్యూటి తహసీల్దార్, ఏఎస్సై, ఆర్ఐ అక్షయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళల భద్రతకు షీటీం భరోసా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై

జగిత్యాలక్రైం: మహిళల భద్రతకు షీటీం నిరంతరం పనిచేస్తుందని షీటీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వివేకానంద మినీ స్టేడియంలో షీటీం, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినులు ఆపద సమయంలో జిల్లా షీటీం నంబరు 87126 70783 సంప్రదించాలన్నారు. వారి రక్షణకు పోలీసుశాఖ, షీటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇద్దరు చొప్పున విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేదింపులను అరికట్టడంలో శిక్షణ ఇచ్చి సైబర్ అంబాసిడర్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ సర్వేయర్‌ను తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

మల్లాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న రవిని తొలగించాలని ఒబులాపూర్ గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. గ్రామశివారులోని సర్వేనెంబర్ 49లోని వివాస్పద భూమిని సర్వే చేయాలని దరఖాస్తు చేయగా, శుక్రవారం డివిజన్ సర్వేయర్ దేవరాజు సమక్షంలోనే మండల కాంట్రాక్ట్ సర్వేయర్ రవి టీ పహణీ లేకుండా గ్రామనక్షతో కొలిచి చుట్టుపక్కల గల సర్వేనెంబర్లు 41, 45, 46, 47, 48 ల్లోకి హద్దులు చూపి తప్పుదోవ పట్టించాడన్నారు. తప్పుడు సర్వేలతో భూ వివాదాలకు కారణమవుతున్నాడని, సదరు సర్వేయర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. నీటి వసతి, కరెంట్ సౌకర్యం, మూత్రశాలలు పనులు జరుగుతుండగా నర్సింహునిపేటలో పీఆర్ డీఈ అశ్విన్, ఆరవెల్లిలో ఎంపీవో మహేందర్, పీఆర్ ఏఈ షంశేర్‌అలీ, ఎంఈవో శ్రీనివాస్ పర్యటించి పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. పాఠశాలలు పున:ప్రారంభించే లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఉద్యోగ విరమణ తరువాత సామాజిక సేవలో పాల్గొనాలి

సారంగాపూర్: ఉద్యోగ విరమణ పొందిన ప్రతీ ఉద్యోగి సమాజసేవలో విస్తృతంగా పాల్గొనాలని కేడీసీసీ జగిత్యాల శాఖ మేనేజర్ మోహిజ్‌పాషా, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సారంగాపూర్ సింగిల్‌విండో ఎండీ. ఇస్మాయిల్ సన్మాన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ కేడీసీసీ డీజీఎం నారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సాయికుమార్, సిద్దిఖీ, విండో చైర్మన్ ఏలేటి నర్సింహ్మారెడ్డి, రైతులు, సంఘ సభ్యులు, సీఈవో అయ్యోరి తిరుపతి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రానికి చెందిన పిట్టల సమాజ సేవకుడు వంశీ తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మండలంలోని ఎర్దండిలోని ఓడ్డెర కాలనీకి చెందిన ఆరుగురు విద్యార్థులకు రూ.36వేలు వెచ్చించి ఆరు సైకిళ్లను అందచేశారు. పాఠశాల వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు సైకిళ్లు అందించారు. ఈ సందర్భంగా వంశీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో రెబ్బటి రాజేందర్, బొమ్మెన గణేశ్, నేమూరి నరేశ్, నాంపెల్లి రమేశ్, కుంబాజీ శ్రీకాంత్, అక్షయ్, శ్రీనివాస్, ఒడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

మల్లాపూర్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. దీనిపై రైతులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు కటింగ్‌తో నిలువు దోపిడీ అడ్డుకోవాలని, జీలుగ, జనము విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

నాలా పూడికతీత పనులు చేపట్టాలి



నాలాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: వర్షాకాలం రానున్న నేపథ్యంలో జిల్లాలోని నాలాల పూడికతీత చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలాల అంతర్గత డ్రైయినేజీల్లో పూడికతీత పనులను వెంటనే చేపట్టకపోతే వరదనీరు వెళ్లడం ఇబ్బందికరంగా ఉంటుందని, వెంటనే నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు వరద ముప్పు లేకుండా నాలాల పూడికతీత పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షకాలంలో నాలాల వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ ప్రేమలత ఉన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



నీటిని పారబోస్తున్న సిబ్బంది

పెగడపల్లి: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా పర్యటిస్తూ ట్యాంకులు వీధుల్లోని గుంతలను పరిశీలించారు. నీటి తొట్టీలు, టైర్లలో ఉన్న నీటి నిల్వలను పారబోయించారు. సీజనల్ వ్యాధుల నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు ఆశవర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాట్లవాయిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాయికల్:మండలం తాట్లవాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2010–11 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి శుక్రవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. చదువుకున్న సమయంలో పాఠశాలలో చేసిన అల్లర్లను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు.

గొల్లపల్లి: మండలంలోని అగ్గిమల్ల హైస్కూల్‌లో 2013–14 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్ననాటి సమయంలో చేసిన అల్లర్లను గుర్తుచేసుకున్నారు.

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని హైస్కూల్లో 2003–04 లో చదువుకున్న పూర్వవిద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా గడిపారు. కార్యక్రమంలో గురువులు రాజు, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



హెచ్‌ఎం జానకిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సారంగాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ అన్నారు. మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కోంద్ర జానకి పదవీవిరమణ సందర్భంగా ఆమెకు జరిగిన సన్మాన సభలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో కంటే మెరుగైన బోధన అందుతుందని, ప్రభుత్వం పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ కారణంగా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. హెచ్ఎం జానకి మాట్లాడుతూ మా ఇంటి దైవం దుబ్బరాజేశ్వరస్వామి కొలువైన పెంబట్ల–కోనాపూర్ గ్రామాల్లో సుదీర్ఘ కాలం హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ పొందడం, పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధిపరచి, మంచి ఫలితాలను సాధించడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమైన ఓ బాధితుడికి ఫేస్‌బుక్ మిత్రులు అండగా నిలిచి రూ. 1.40 లక్షలు సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన అక్కనపెల్లి బాబుకుమార్ గత కొన్నేళ్లుగా గ్రామంలో వాటర్‌ప్లాంట్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు పూర్తిగా తెగిపోయింది. బాబుకుమార్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ కుటుంబానికి సాయం అందించాలని కోరుతూ మే 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. దీనికి స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటకలోని బళ్లారి మిత్రులు బాబుకుమార్ భార్య రాణి బ్యాంకు ఖాతాలో రూ. 1.40 లక్షలు విరాళాలు అందించారు. వాటి నుంచి రమేశ్ రూ.50 వేలు రాణి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి బ్యాంకు అధికారుల చేతుల మీదుగా అందించారు. మిగిలిన డబ్బులు వైద్యం, పిల్లల చదువుల కోసం వాడుకుంటారని రమేశ్ తెలిపాడు.

బడిబాటలో అందరూ భాగస్వాములవ్వాలి

మల్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన లభిస్తుందని, బడిబాటలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈవో ఐత శ్రీనివాస్ అన్నారు. జూన్ 3 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యంలో నాణ్యమైన బోధనను వివరిస్తూ, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీ చేస్తామని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు, పాఠశాలల ఎస్ఎంసి కమిటీ సభ్యులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొని, బడిబాటను విజయవంతం చేయాలని ఎంఈవో కోరారు.